ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 13 జూన్ 2025

జిల్లాస్థాయి యోగా పోటీలు ప్రారంభం

పార్వతీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. 10-18 ఏళ్లు, 19-35 ఏళ్ల పైబడిన వారికి సోలో విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం తదితర అంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. శనివారం వరకు ఈ పోటీలు కొన సాగనున్నాయి. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని డీఆర్వో కె.హేమలత తెలిపారు.

తెరుచుకున్న పాఠశాలలు

- సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం
- విద్యామిత్ర కిట్లు పంపిణీ

పార్వతీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని పాఠశాలలు తెరుచుకున్నాయి. దాదాపు 50 రోజుల వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు బడి బాట పట్టారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. మరోవైపు ఉపాధ్యాయులు బదిలీల్లో బిజీబిజీగా ఉన్నారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ముందుగా స్కూళ్ల ఆవరణలు, గదులను శుభ్రం చేసుకున్నారు. కొత్తగా వచ్చిన వారికి పాత విద్యార్థులు స్వాగతం పలికారు. మొదటి రోజున విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను అందించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం ద్వారా విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందించారు.


సాలూరు మండలం మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

ప్రజా పాలనకు ఏడాది

- జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకుల సంబరాలు

పార్వతీపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పడి ఏడాది పూర్తికావడంతో కూటమి నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని, గతంలో ఎన్నడూ లేనంతగా పాలన పరిగెడుతోందని అన్నారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏడాది పాలన సంబరాలను ఘనంగా నిర్వహించారు.


జిల్లా కేంద్రం పార్వతీపురంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

కౌలు రైతుకు గుర్తింపేదీ?





- సీసీఆర్‌సీ జారీలో అధికారుల తాత్సారం
- జిల్లాలో 8,250 మంది కౌలు రైతులు
- ఇప్పటి వరకు 800 మందికే కార్డుల అందజేత
- ప్రభుత్వ పథకాలు కోల్పోతున్న వైనం

పాలకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కౌలు రైతులకు గుర్తింపు లభించడం లేదు. వారికి పంట సాగుదారు హక్కు కార్డులు (సీసీఆర్‌సీ) అందజేయడంలో అధికారులు తాత్సారం చేస్తోన్నారు. కనీసం పది శాతం మందికి కూడా కార్డులు అందలేదు. దీంతో వారు ప్రభుత్వ పథకాలు, రాయితీలకు దూరమవుతున్నారు. కౌలు రైతులను గుర్తించాలని, వారికి అవసరమైన పంట సాగుదారు హక్కు కార్డులు అందజేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు ఆదేశాలు జారీ చేసింది. 2025 ఖరీఫ్ సీజన్‌లో పార్వతీపురం మన్యం జిల్లాలో 8,250 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, జిల్లాలో ఇప్పటివరకు కేవలం 800 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు అందజేశారు. రెవెన్యూ, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేసి కౌలు రైతులను గుర్తించాల్సిన అవసరం ఉంది. కానీ, జిల్లాలో ఆ విధంగా అడుగులు పడడం లేదు. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌలు రైతుకు గుర్తింపు కార్డు రావాలంటే సంబంధిత భూ యజమానుల నుంచి అంగీకార పత్రం తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. ఇందుకు అధిక శాతం మంది భూ యజమానులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కౌలుదారులు గుర్తింపు కార్డులు పొందడం గగనమవుతుంది.

కౌలు గుర్తింపు కార్డుతో ప్రయోజనాలివే..

కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఉంటే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలను నేరుగా విక్రయించుకోవచ్చు. బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే వారికి నష్ట పరిహారం, బీమా సదుపాయం అందుతుంది. ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు సైతం వర్తిస్తాయి.

అడ్డంకులు ఎన్నో..

ప్రస్తుతం కౌలు చట్టంలోని నిబంధనలు కౌలు రైతులకు గుదిబండగా మారుతున్నాయి. 2005లో కౌలు చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం భూ యజమానులతో సంబంధం లేకుండా వాస్తవ కౌలు, సాగుదారులను రెవెన్యూ అధికారులు గుర్తిస్తే చాలు వారికి వ్యవసాయశాఖ అధికారులు రుణ అర్హత కార్డులు ఇచ్చేవారు. తద్వారా ఎక్కువ మందికి ప్రయోజనం కలిగేది. 2009 వరకు ఇదే విధంగా కౌలు రైతులను గుర్తించేవారు. అయితే, 2009 తర్వాత సీసీఆర్‌సీ విధానం అమల్లోకి రావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ విధానంలో భూ యజమాని అంగీకార పత్రం తప్పనిసరి అయింది. దీంతో అధిక సంఖ్యలో భూయజమానులు అంగీకారం పత్రం ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు. ఈ పత్రం ఇస్తే భూమి మీద హక్కును కోల్పోతామని, ప్రభుత్వ రాయితీలు అందవనే అనుమానంతో వారు వెనుకంజ వేస్తున్నారు. కొంత మంది భూ యజమానులు కౌలుకు ఇచ్చే భూముల మీద ముందుగానే వ్యవసాయ రుణాలు తీసుకుంటున్నారు. దీంతో ఆ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులు రుణ అర్హత కోల్పోతున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు భూ యజమానులను ఒప్పించడంలో విఫలమవుతున్నారు. కౌలురైతులు సీసీఆర్ కార్డులను పొందలేకపోతున్నారు.

నిబంధనలు సడలించాలి..

కౌలు చట్టం నిబంధనలతో కౌలు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. భూ యజమానుల నుంచి ఒప్పంద పత్రం తీసుకొని కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం సాధ్యం కాదు. ఈ నిబంధనలు సడలించి కౌలుదారులను గుర్తించి భూ యజమానులకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీ రుణాలు, పరిహారాలు అందించాలి.

-కిమిడి రామ్మూర్తినాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి..

కౌలు చట్టం ద్వారా లభించే ఉపయోగాలను కౌలు రైతులకు వివరించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుంది. దీంతో కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు ముందుకు రావడం లేదు. అలాగే కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులతో భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

-బుడితి అప్పలనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

గుర్తింపు కార్డులు అందజేస్తాం..

జిల్లాలో కౌలు రైతుల గుర్తింపునకు లక్ష్యాలు నిర్దేశించాం. ప్రతి మండలం నుంచి కౌలు రైతుల గుర్తింపునకు రెవెన్యూ, వ్యవసాయశాఖలు ముందుకు వెళ్లాలి. ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు అందజేస్తాం.

-రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు.. వారు పెట్టే ప్రలోభాలకు లొంగి మోసపోవద్దని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు బదులివ్వద్దని, డిజిటల్ అరెస్టులు లాంటివి లేవని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'డిజిటల్ అరెస్టు అని ఎవరైనా చెబితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు షేర్ చేయవద్దు. అలా చేసి ఇబ్బందులు, లేని సమస్యలను కొన్ని తెచ్చుకోవద్దు. బెట్టింగ్ యాప్‌లు ఉపయోగించినా, ఇతరులకు ప్రమోట్ చేసినా చట్టరీత్యా నేరం. మీకు లాటరీ తగిలింది.. గెలిచారు.. మీకు పాస్‌వర్డ్ వస్తుంది.. లేదా (మిగతా 8వ పేజీలో)

మూడో విడతకు సమాయత్తం


బాసంగి పరిధిలో ఉన్న భూములు ఇవే

- 33 గ్రామాల్లో రీసర్వేకు సన్నద్ధం
- పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించిన ప్రభుత్వం
- సిద్ధమైన అధికార యంత్రాంగం

జియ్యమ్మవలస, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వే అస్తవ్యస్తంగా సాగింది. రికార్డులన్నీ తప్పులు తడకలగా మారాయి. దీంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అయితే దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం పక్కాగా రీ సర్వే చేపట్టేందుకు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో జిల్లాలో మూడో విడత రీసర్వేకు రంగం సిద్ధమైంది. పార్వతీపురం, పాలకొండ డివిజన్లలోని 33 గ్రామాల్లో మొత్తంగా 26,147.90 ఎకరాల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే ఆర్ఎస్‌డీటీలు, మండల, విలేజ్ సర్వేయర్లకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు చేయకుండా నియమ నిబంధనల మేరకు పక్కాగా రీ సర్వే చేపట్టి నివేదికలు అందించాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మరో రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో చేపట్టిన మొదటి విడతగా చేపట్టి రీ సర్వే మరో వారంలో పూర్తి కానుంది. రెండో విడత రీ సర్వే కూడా దాదాపు పూర్తయ్యింది. ఈ నెలాఖరుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం, పాలకొండ డివిజన్ల పరిధిలో 15 మండలాలు, 965 గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో 5,78,016 ఎకరాల్లో రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 235 మంది గ్రామ సర్వేయర్లు, 15 మంది మండల సర్వేయర్లు, ఆర్ఎస్‌డీటీలు, వీఆర్‌వోలు పూర్తిగా ఆ పనిలో నిమగ్నమయ్యారు.

- మొదటి విడతలో 15 గ్రామాల్లో రీసర్వే చేసిన అధికారులు ఈ నెలలోనే పూర్తి నివేదిక అందించనున్నారు. 36 బ్లాకుల పరిధిలో 8,910.82 ఎకరాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని రీ సర్వే చేశారు. ఇప్పటివరకు పార్వతీపురం డివిజన్‌లో గరుగుబిల్లి మండలం దళాయివలస , పాచిపెంట మండలం పూడిలో రీసర్వే పూర్తయింది. డీఎల్ఆర్, 13 నోటిఫికేషన్ ఇచ్చారు.
- పాలకొండ డివిజన్‌లో కురుపాం మండలం పెదవనజ, జియ్యమ్మవలస మండలం రాజయ్యపేట, గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ, సీతంపేట మండలం భూచేద్రి గ్రామాలు రీసర్వే పూర్తయింది. డీఎల్ఆర్ , 13 నోటిఫికేషన్ ఇచ్చారు.
- ఇక రెండో విడతకు సంబంధించి పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో చెరో 15 గ్రామాలు ఎంపిక చేసి 28,967.11 ఎకరాల్లో రీసర్వే చేపట్టారు. ఈ ప్రక్రియ కూడా దాదాపు పూర్తయింది. కేవలం లాగిన్ వర్క్స్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఎనిమిది గ్రామాలకు డీఎల్ఆర్ పూర్తయింది. 22 గ్రామాలకు మాత్రం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది.

మూడో విడతలో ఎంపికైన గ్రామాలు..

- మూడో విడతలో భాగంగా పాలకొండ డివిజన్ పరిధిలో 21 గ్రామాల్లో 10,824 ఎకరాల్లో రీసర్వే (మిగతా 8వ పేజీలో)

'తల్లికి వందనం' ప్రారంభం

- గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా
- జిల్లాలో 1,08,951 మందికి లబ్ధి



పార్వతీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని గురువారం ప్రారంభించింది. అర్హులైన విద్యార్థులందరికీ ఏడాదికి రూ.15 వేలు అందించే విధంగా పథకాన్ని రూపొందించింది. ఇందులో రూ.2 వేలు పాఠశాల మెయింటినెన్స్‌కు మినహాయించి మిగిలిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి కొన్ని నిబంధనలు పెడుతూ అర్హుల జాబితాతో పాటు అనర్హుల జాబితాను కూడా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసింది. జిల్లాకు సంబంధించి 1,08,951 మంది విద్యార్థులు తల్లికి వందనానికి అర్హత సాధించారు. ఈ మేరకు 69,600 మంది తల్లుల ఖాతాలకు శుక్రవారం నుంచి నగదు జమచేయనున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాయన్న చానెల్‌కు మంచి రోజులు

- రైతుల చొరవతో పూడిక తొలగింపు
- షట్టర్ల ఏర్పాటు

6లో

మామిడి, పామాయిల్ మొక్కలు ధ్వంసం

6లో

సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

- అశోక్‌గజపతిరాజు

6లో

నా మాటే శాసనం

- మునిసిపల్ అజెండాలోని అంశాలను ఆమోదించేది లేదు
- మెజార్టీ సభ్యులు చేతులెత్తినా పట్టించుకోని వైనం
- ఇదీ పార్వతీపురం చైర్‌పర్సన్ గౌరీశ్వరి తీరు
- వైసీపీ కౌన్సిలర్లతో కలిసి బయటకు వెళ్లిపోవడంపై విమర్శలు

పార్వతీపురంటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ గౌరీశ్వరి వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అజెండాలోని పలు అంశాలను ఆమోదించేందుకు ఆమె అంగీకరించలేదు. ఆ అంశాలను ఆమోదించాలని మెజార్టీ సభ్యులు చేతులెత్తినా ఆమె పట్టించుకోలేదు. 'నా మాటే శాసనం.. నేను చెప్పిందే ఆమోదం' అన్నట్లు వ్యవహరించారు. పైగా తమ పార్టీ వైసీపీ కౌన్సిలర్లతో కలిసి సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ జరిగింది..

స్థానిక మునిసిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గౌరీశ్వరి అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలు చర్చకు వచ్చే ముందు 8, 24వార్డుల టీడీపీ కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, మంత్రి (మిగతా 8వ పేజీలో)


67, 72 అంశాలను ఆమోదిస్తున్నట్లు చేతులను పైకెత్తిన టీడీపీ కౌన్సిల్ సభ్యులు



డీవీఎంఎం పాఠశాలలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న డీఆర్వో హేమలత

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం

- జిల్లాలోని పాఠశాలలకు 19,741 బస్తాల పంపిణీ
- డీఆర్వో హేమలత

బెలగాం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సన్న బియ్యం అందించినట్లు డీఆర్వో కె.హేమలత తెలిపారు. ఈ బియ్యాన్నే వండి విద్యార్థులకు భోజనం పెట్టాలని అన్నారు. గురువారం స్థానిక డీవీఎంఎం పాఠశాలలో విద్యాశాఖాధికారులతో కలిసి డీఆర్వో (మిగతా 8వ పేజీలో)

పాఠశాలలు పునఃప్రారంభం

● బడి బాట పట్టిన విద్యార్థులు ● సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తెహెరా సుల్తానా



సాలూరు మండలం కూనంబందవలసలో సన్నబియ్యంతో వండిన అన్నం తింటున్న విద్యార్థులు



గంట్యాడ పాఠశాలకు హాజరైన విద్యార్థులు

విజయనగరం కలెక్టరేట్/సాలూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో పాఠశాలలు గురువారం పునఃప్రారంభ మయ్యాయి. దాదాపు 50 రోజులు తరువాత విద్యార్థులు బడి బాట పట్టారు. అన్ని పాఠశాలలు తెరిచినా విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. మరోవైపు ఉపాధ్యాయులు బదిలీల్లో బిజీబిజీగా ఉన్నారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ముందుగా అవరణ, గదులను శుభ్రం చేసుకున్నారు. కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు. మొదటి రోజున ఉపాధ్యాయులు విద్యార్థిమిత్ర కిట్లు అందించారు. అలాగే డొక్కా సీతమ్మ పథకం కింద విద్యార్థులకు తొలిరోజు గుడ్డు కూర, సాంబారుతో సన్నబియ్యం భోజనం ఉపాధ్యాయులు అందించారు.

జిల్లాలో ఏపీఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్: ఏపీఎంఎస్ డైరెక్టర్ తెహెరా సుల్తానా భో గాపురం మండలం అక్కివరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిమిత్ర కిట్లు అందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డీఎస్సీ పరీక్ష కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. సమగ్రశిక్ష ఏపీసీ రామారా వు, సీఎంవో ఆదినారాయణ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు

నెల్లిమర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాభ్యాసం చేయాలని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని కల్యా ణ మండపం ఆవరణలో జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్‌రావు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని అన్నారు. ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, జడ్పీ సీఈఓ బి.వి. సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ అధికారి మురళీ మోహన్, జిల్లా టూరిజం అధికారి కుమారస్వామి, దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీఓ కృష్ణంరాజు, నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాహాలకు విరామం



సాలూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాహాలకు గురువారం నుంచి విరామం వచ్చింది. మరో 44 రోజులు వివాహాలకు సెలవు. ఇప్పటి వరకు వేలాది పెళ్లిళ్లు ఉమ్మడి జిల్లాలో నిర్వహించారు. గురుమౌఢ్యమి రావడంతో వివాహాలు చేయరాదు. ఈ మౌఢ్యమి వచ్చే నెల ఏడో తేదీ వరకు ఉంది. దీంతో శుభకార్యాలకు బ్రేక్ పడింది. అలాగే ఈనెల 26 నుంచి వచ్చే నెల 24 వరకు ఆషాఢ మాసం కావడంతో ఎటువంటి పెళ్లిళ్లు చేయరు. మళ్లీ వచ్చే నెల 26 నుంచి వివాహాలు జరగనున్నాయి.

సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

● టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అమలువతున్నాయని టీడీపీ సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన నేపథ్యంలో గురువారం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకూ సాగిన అస్తవ్యస్థ పాలన, నియంతృత్వ విధానాలు ఎన్నడూ చూడలేదన్నారు. తనను కూడా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల బాధలు వర్ణనాతీతంగా మారాయన్నారు. వైసీపీని వ్యతిరేకించే పార్టీలంతా ఏకమై, ఆ పాలనకు ముగింపు పలికేందుకు కంకణం కట్టుకుని విజయం సాధించాయన్నారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించడంతో ఎంతో మంది ఇబ్బంది పడ్డారని గుర్తు చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఇతరులపై కక్ష సాధింపులకు దిగకూడదన్నారు. తప్పులు చేసేవారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని ఆయన చెప్పారు. ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా వెళ్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి మంచి పేరు వచ్చే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. మంత్రి లోకేష్ కూడా వినూత్నంగా ఆలోచించి ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు అహోరాత్రులు శ్రమిస్తున్నారన్నారు. ఏడాది పాలన జనరంజకంగా సాగిందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, ఆల్తి బంగారుబాబు, అనురాధ బేగం, బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు



ఎస్.కోట: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



చీపురుపల్లి: నినాదాలు చేస్తున్న తెలుగుదేశం నాయకులు



రాజాం: కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు



కురుపాంలో టీడీపీ నాయకుల సంబరాలు



పాలకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



వీరఘట్టం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి

చీపురుపల్లిలో సంబరాలు..

చీపురుపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ పార్టీల నాయకులు సంబరాలు నిర్వహించారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కేక్ కట్ చేశారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, విసినిగిరి శ్రీనివాసరావు, తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కెంగువ ధనుంజయ్, వెన్నె సన్యాసినాయుడు, టి.కిరణ్, సారేపాక సురేష్, గడె సన్యాసప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే సమగ్ర అభివృద్ధి..

శృంగవరపుకోట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం స్థానిక దేవిబొమ్మ కూడలిలో విజయోత్సవ సభను నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్‌ను కట్ చేశారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి ప్రగతి, సంక్షేమం అందించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడాది పాలన సంబరాలు..

వీరఘట్టం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా వీరఘట్టంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి పాల్గొని, కేక్ కట్ చేశారు. మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ వెంకటరమణ, శాసుబిల్లి బుజ్జి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ● భామిని: సొలికిరి గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాల్లో టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి పాల్గొని, కేక్ కట్ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ కొత్తకోట వేణమ్మ మహిళలకు స్టీలు ప్లేట్లు పంపిణీ చేశారు.

● సాలూరు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి) అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం సంబరాలు నిర్వహించారు. చిట్టితో పాటు ఏఎంసీ ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, టీడీపీ మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణు, పార్టీ మెంటాడ మండల అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ తదితరులు కేక్ కట్ చేశారు. మంత్రి నివాసం నుంచి పట్టణంలోకి భారీగా బైకుర్యాలీ నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పాలకొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మాళి భాను, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

● కురుపాం: కురుపాంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య ఆధ్వర్యంలో ఏడాది పాలన సంబరాలు నిర్వహించారు. మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఏనుగుల గుంపు మామిడి తోటను ధ్వంసం చేసిన దృశ్యం

మామిడి, పామాయిల్

మొక్కల ధ్వంసం

సీతానగరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన తోటలు ఉన్న కోటసీతారాంపురంలో నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి చెట్లను, పామాయిల్ మొక్కలను ధ్వంసం చేశాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కోటసీతారాంపురం గ్రామంలో బుధవారం జన్మించిన ఏనుగు పిల్లకు సీత అని ట్రాకర్లు, బీట్ అధికారులు, గ్రామస్థులు నామకరణం చేశారు. ఎనిమిది ఏనుగుల గుంపులో ఒకటి శిశువుకు జన్మనివ్వడంతో వాటి సంఖ్య తొమ్మిదికి చేరింది.

సాయన్న చానెల్‌కు మంచి రోజులు

● రైతుల చొరవతో పూడిక తొలగింపు ● షట్టర్ల ఏర్పాటు

రేగిడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కీలకమైన సాయన్న చానల్, దాని అనుబంధ కాలువలు స్వరూపాన్ని కోల్పోయాయి. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని బాగు చేయాలని ఈ ప్రాంత రైతులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిస్థితిలో మార్పు రాలేదు. మరోవైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. దీంతో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవ చూపారు. ఆయన సూచనతో సాయన్న చానల్, ఉపకాలువలకు దేవుదళకు చెందిన పాలవలస వెంకటరమణమూర్తి ఆర్థిక సాయంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. గురువారం నుంచి జేసీబీతో సంకిలి నీటి వినియోగదారుల సంఘం పర్యవేక్షణలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. సంకిలివద్ద చిట్టిగెడ్డ హెడ్ నుంచి తిరుగుడు పూని, అవసరమైన చోట సాయన్నబట్టి, కవిటిబట్టిలకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర పూడికల తొలగింపునకు చర్యలు చేపట్టారు. మరోవైపు ఎప్పుడో బ్రిటిష్ కాలంలో వేసిన షట్టర్లు కూడా పాడైపోయాయి. పుర్లికి చెందిన రైతులు కురిటి రామకోటి, పాలవలస సూర్యారావులు సొంతంగా షట్టర్లు సమకూర్చారు. సాయన్న చానల్ మరమ్మతులకు చొరవ చూపిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు, దాతలకు ఈ ప్రాంత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



సాయన్న చానెల్‌లో పూడిక తొలగిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం

● ఎమ్మెల్యే పార్థసారథి

విజయనగరం దాసన్నపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యమని... ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ వీవీ పార్థసారథి అన్నారు. గురువారం క్షత్రియ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి మోదీ ఎంతో కృషి చేశారన్నారు. భారతదేశం అన్ని రంగాల్లో దూసుకుపోవడానికి ఏకైక కారణం ప్రధాని నరేంద్రమోదీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీతారామంజనేయ చౌదరి, కేశవకాంత్, రెడ్డి పావని, కుసుమంచి సుబ్బారావు, లక్ష్మీనరసింహం, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దత్తిరాజేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆరికతోట సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ చౌదంతివలస ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఎ.అనంతరావు తెలిపారు. ఆర్‌అండ్‌బీ జంక్షన్ ఏరియా, చౌదంతివలస, స్టేషన్ బూర్జవలస, కె.కృష్ణాపురం, కె.కొత్తవలస, ఎం.కొత్తవలస, మరడాం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలి పారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

లక్కవరపుకోటలో..

లక్కవరపుకోట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల సోంపురం, ఎల్.కోట, సంతపేట జంక్షన్‌కు సంబంధించిన మార్గాల్లో శుక్రవారం విద్యుత్ కోత ఉంటుందని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

డెంకాడలో...

డెంకాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ ఈఈ జి.సురేష్ బాబు తెలిపారు. మండలంలోని కృష్ణాపురం, రఘుమండ, గుండాలపేట, సీజీఎం లేఅవుట్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనునుట్టు తెలిపారు. తమతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్లతో పాటు టొంపలపేట, కొత్తపేట, నీలంరాజుపేట, కుదిపి, జగ్గరాజుపేట, ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

తహసీల్దారుగా సుదర్శనరావు

సంతకవిటి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండల తహసీల్దారుగా బి.సుదర్శనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన బి.సత్యం శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో నెల్లిమర్ల తహసీల్దారుగా పనిచేస్తున్న సుదర్శనరావు బదిలీపై వచ్చారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విధుల్లో చేరిన మేనేజర్ జయరాం

నెల్లిమర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయ మేనేజర్‌గా జయరామ్ గురువారం విధుల్లో చేరారు. ఆయన పాలకొండ పురపాలక సంఘం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గురువారం ఆయన చైర్‌పర్సన్ బంగారు సరోజినిని, కమిషనర్ తారక్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

యువకులకు ఎస్ఐ కౌన్సెలింగ్

నెల్లిమర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేట, కొండగుంపాం గ్రామాలకు చెందిన పలువురు యువకులకు ఎస్ఐ బి.గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. యువకులు నేరాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డీవీఎస్ అరుణ ఒక ప్రకటనలో కోరారు. వీటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వాని స్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేందుకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వీరికి ఈ నెల 24న పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

రేపు టీడీపీ విజయోత్సవ ర్యాలీ

విజయనగరం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన నేపథ్యంలో టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గం టీడీపీ ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ ర్యాలీ జరగనుంది. సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్ నుంచి ప్రారంభమై, డాబాతోట, కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా గంటస్తంభం వరకూ కొనసాగనుంది.

విద్యాశాఖలో నూతన అధ్యాయం: ఎమ్మెల్యే



సన్నబియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో నూతన అధ్యాయానికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుడుతున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందించారు. వీటితో పాటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం ఎంత ముఖ్యమో.. విద్య అంతే విలువైనదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకానికి అందించే బియ్యం తినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, నాయకులు జుత్తాడ రామసత్యం, చెక్క కిరణ్, అనకాపల్లి చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదంపై దిగ్ర్భాంతి

అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదం తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. వైద్య కళాశాల వసతి భవనంపై కూలడం మహా విషాదమన్నారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు దేశం బాసటగా ఉండాల్సిన సమయం ఇదని అన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గడచిన 37 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడి మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్న సిబ్బందికి గురువారం ఆయన మద్దతు ప్రకటించారు. శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి వరుసగా రూ.29,200, రూ.24,500 జీతంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, సెలవులు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయినా, అంగవైకల్యం ఏర్పడినా సంబంధిత సిబ్బందికి బీమా సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శిబిరంలో పలువురు యూనియన్ నాయకులు , కార్మికులు పాల్గొన్నారు.

వనంగుడిలో ఘనంగా చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారిని పూలతో అలంకరించిన దృశ్యం

విజయనగరం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ వనంగుడి (రైల్వే స్టేషన్ రోడ్డు)లో గురువారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయికిరణ్‌శర్మ, టీఎఎన్ శర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు పైడిమాంబను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పిండివంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

జంతువుల సంరక్షణకు కృషి చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల జంతు సంక్షేమ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి జంతువుల పరిరక్షణకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ స్థానిక తహసీల్దార్ పి.ఆదిలక్ష్మిని కోరారు. ఈమేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ జీవో నెంబరు 44ను అనుసరించి మండల స్థాయిలో జంతు సంక్షేమ కమిటీలు తహసీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని గుజ్జింగివలస, తెట్టంగి, పోలయవలస, తాటిపూడి గ్రామాల నుంచి రోజూ విజయనగరం, విశాఖపట్టణం కబేళాలకు పశువులను పంపిస్తున్నారన్నారు. సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా జంతువుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, ఊజురు ఝాన్సీ, వేమల యమున తదితరులు పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్య విద్యార్థులకు తరగతులు

విజయనగరం దాసన్నపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహారాజా సంస్కృత కళాశాలలోని ఏయూ దూరవిద్యా కేంద్రంలో విద్యార్థులకు వారాంతపు తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ జి.జనార్దన్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు జూన్ 14, 15, 21, 22, 28, 29, జూలై 5, 6, 12, 13 తేదీల్లో ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుర్తింపు కార్డుతో విద్యార్థులు స్టడీ సెంటర్‌కు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

సర్కారు బడులకే పరిమితం చేయాలి

చీపురుపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని కేవలం సర్కారు బడుల పిల్లలకే పరిమితం చేసేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గొర్లె పద్మావతి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేయడం వల్ల ప్రభుత్వ బడులకు పరోక్షంగా అన్యాయం జరుగుతుందన్నారు.

మృతులకు నివాళి

విజయనగరం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయిన సంఘటనలో మృతి చెందిన వారికి నగరంలోని కొణిసివీధిలో ఉన్న తెలుగు వెలుగు కార్యాలయంలో గురువారం సాయంత్రం నివాళులు అర్పించారు. తెలుగు వెలుగు సంస్థ వ్యవస్థాపకుడు మక్కువ చంద్రకళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలతో బంగారు భవిష్యత్తు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే వారికి బంగారు భవిష్యత్ కల్పిస్తామని మండలంలోని కొట్టాం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం భాస్కరరావు అన్నారు. గురువారం తమ పాఠశాల ఉపాధ్యాయులతో కలసి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను గురించి తెలియజేశారు.

రాజాంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ నమూనా

రాజాం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ కూడలి, చీపురుపల్లి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు కమిషనర్ జె.రామప్పలనాయుడు చర్యలు చేపట్టారు. సిమెంట్‌తో తయారు చేసిన సిగ్నల్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీఓ డి.తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలమైన వంతెనతో భయం



కూలిపోయే స్థితిలో ఉన్న వంతెన ఇదే

రాజాం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంతకాపల్లి - మొగిలివలస గ్రామాల మధ్య సారధి గెడ్డపై వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన దాదాపుగా శిథిలమైంది. ఏక్షణాన్నైనా నేలమట్టమయ్యే స్థితికి చేరింది. వంతెన అడుగుభాగం పెచ్చులూడిపోయింది. దీంతో ఈ వంతెన మీదుగా ద్విచక్ర వాహనదారులు మినహా పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు సాగించేందుకు కష్టంగా ఉంది. కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రైం న్యూస్

అత్యాచారం కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన మాదిరెడ్డి అప్పారావుకు 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ2వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. తనపై అప్పారావు అత్యాచారానికి పాల్పడినట్టు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2023లో అప్పటి ఆంధ్ర పోలీసు స్టేషన్ ఎస్ఐ సిద్ధార్థ్ కేసు నమోదు చేశారు. అప్పటి గజపతినగరం సీఐ ఎల్ అప్పలనాయుడు దర్యాప్తు చేపట్టి.. న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితుడు మాదిరెడ్డి అప్పారావు నేరానికి పాల్పడినట్టు రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

భోగాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముక్కాం గ్రామానికి చెందిన సురపతి దానయ్య(45) గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... దానయ్య కుటుంబ సభ్యులతో విశాఖపట్నంలోని జాలరిపేటలో నివాసం ఉంటున్నాడు. అతని భార్య ఎల్లమ్మతో దానయ్యకు కొంత కాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. వారం క్రితం భార్యను దానయ్య కొట్టడంతో విశాఖ 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో దానయ్యను పోలీసులు స్టేషన్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి సమస్య పరిష్కరించుకుంటామంటూ స్థానికులు పోలీసులకు వివరించారు. రెండురోజుల క్రితం భార్యను మరోసారి కొట్టాడు. దీంతో ఆమె మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్ద మనుషులు, పోలీసుల వద్దకు వెళ్లవలసి వస్తుందని దానయ్య మనస్తాపానికి గురయ్యాడు. దీంతో స్వగ్రామం ముక్కాం వచ్చి.. తన ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సురపతి ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

దత్తిరాజేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చినకాద గ్రామానికి చెందిన ఆవాల సూర్యనారాయణ పాము కాటుతో మృతిచెందాడు. పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి సూర్యనారాయణ బహిర్భూమికి వెళుతుండగా పాము కాటు వేసింది. అటుగా వెళ్లిన గ్రామస్థులు చూసి కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య రాము, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల మృత్యువాత

మెంటాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లిన గొర్రెలు గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. జక్కువ గ్రామానికి చెందిన కరగాన రాము, కరగాన అప్పలరాము మేకల మందను కొండలింగాలవలస కొండప్రాంతానికి మేతకు తీసుకువెళ్లారు. అందులో మూడు గొర్రెలు తప్పిపోయాయి. వాటి కోసం గాలించగా కొండ సమీపంలో నున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చనిపోయినట్టు గొర్రెల కాపరులు గుర్తించారు. సమాచారం అందుకున్న విద్యుత్ లైన్‌మేన్ ట్రాన్స్‌ఫార్మర్ స్విచ్ఛాఫ్ చేశారు. ఈ విషయమై పోలీసులకు, విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చామని బాధితులు తెలిపారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

సంతకవిటి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాధవరాయిపురం గ్రామంలో రెండు కుటుంబాల మధ్య స్థలం వివాదంలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వాసు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... కొంచాడ బుల్లెమ్మ, కొంచాడ రామకృష్ణ కుటుంబాల మధ్య బుధవారం రాత్రి స్థలం విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తనపై కొంచాడ రామకృష్ణ కుటుంబ సభ్యులు ముగ్గురు దాడి చేసినట్లు బుల్లెమ్మ గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనధికార కట్టడాలను తొలగిస్తాం



కాలువపై ఆక్రమణలను తొలగిస్తున్న నగర పాలక సంస్థ సిబ్బంది

విజయనగరం రింగురోడ్డు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాలువలపై అనధికార కట్టడాలు నిర్మిస్తే, కూల్చేస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. గురువారం తోటపాలెంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కాలువపై ఆక్రమణలను ఆయన గుర్తించారు. తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువలపై పలకలు వేసి కాలువ పరిశుభ్రతకు ఆటంకం కలిగిస్తున్నట్టు పలుచోట్ల గుర్తించామన్నారు. ఈ పలకలు వేయడం వల్ల మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, కాలువలపై ఎట్టి నిర్మాణాలను చేపట్టరాదని సూచించారు.

ఏపీ ఆదర్శ పాఠశాలలో తనిఖీ



పిల్లలతో కలసి భోజనం చేస్తున్న జేడీ సుల్తాన్

డెంకాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కివరం వద్ద ఉన్న ఏపీ ఆదర్శ పాఠశాలను స్కూల్‌ను జేడీ తహేర సుల్తాన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె చేతుల మీదుగా విద్యాకిట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, ఏఎంవో కంది ధర్మకుమార్, ఏపీసీ ఎ.రామారావు, సీఎంవో వి.ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న పీవో ఆరుద్ర

గరివిడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో ఆరుద్ర అన్నారు. గెడ్డపువలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆటపాటలతో పాటు చదువులు, పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతోందని, దీనిని వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, యూనియన్ నాయకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

గింజేరుకు విద్యుత్ కష్టాలు

గంట్యాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గింజేరు గ్రామాన్ని విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు ఉక్కపోత.. అటు విద్యుత్ కోతతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరా ఎప్పటికప్పుడు నిలిచిపోవడం వల్ల పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. దీంతో అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన ఎస్.వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు విద్యుత్ కష్టాలు తప్పించాలని వేడుకుంటున్నారు.

మూడోవిడతకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. పాలకొండ మండలం అంపిల్లి(618.55 ఎకరాలు), వడమ(662.65 ఎకరాలు), జీఎం పురం(720.21 ఎకరాలు), ఎన్‌కే రాజపురం(543.02 ఎకరాలు), భామిని మండలం పాలవలస(953.52 ఎకరాలు), మనుమకొండ(802.20 ఎకరాలు), జియ్యమ్మవలస మండలం బాసంగి(696.09 ఎకరాలు), గెడ్డతిరువాడ(1296.20 ఎకరాలు)ని ఎంపిక చేశారు. కురుపాం మండలం తిత్తిరి(372.12 ఎకరాలు), తెన్నుఖర్జ (820.74 ఎకరాలు), తియ్యాలి(183.57 ఎకరాలు), గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడి(277.77 ఎకరాలు), టిక్కబాయి(188.27 ఎకరాలు), పూతికవలస(111.45 ఎకరాలు), శంభుగూడ(21 ఎకరాలు), డోలుకోన (42.29 ఎకరాలు)లో రీసర్వే చేయనున్నారు. సీతంపేట మండలం కుడ్డపల్లి (260.05 ఎకరాలు), కోసంగి(650.54 ఎకరాలు), కొల్లాడ(266.60 ఎకరాలు), కోపువలస (50.03 ఎకరాలు), వీరఘట్టం మండలం తెట్టంగిలో (1282.13 ఎకరాలు)ను ఎంపిక చేశారు.

● పార్వతీపురం డివిజన్‌లో 12 గ్రామాల్లో మొత్తంగా 15,318.90 ఎకరాల్లో రీసర్వే చేయనున్నారు. పార్వతీపురం మండలంలో సూడిగాం (1173.75 ఎకరాలు), డీకే పట్నం(1146.47 ఎకరాలు), సీతానగరం మండలం గాదెలవలస(1084.34 ఎకరాలు), చినభోగిలి(1396.97 ఎకరాలు)ని ఎంపిక చేశారు. మక్కువ మండలంలో సీబిల్లి పెద్దవలస(1891.79 ఎకరాలు), సాలూరు మండలం మరిపల్లి(2190.50 ఎకరాలు), గరుగుబిల్లి మండలం కొత్తపల్లి(1099.30 ఎకరాలు), పెద్దూరు వద్ద శివరాంపురం (226.02 ఎకరాలు), పాచిపెంట మండలం కారివలస (1206.83 ఎకరాలు), కొమరాడ మండలం గుణానుపురం(1084.49 ఎకరాలు), దేవుకోన (1190.49 ఎకరాలు), బలిజిపేట మండలం అరసాడ(2727.45 ఎకరాలు)లో రీ సర్వే చేయనున్నారు.

పకడ్బందీగా చేస్తాం

రీసర్వేను పకడ్బందీగా చేస్తాం. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూస్తాం. ఒకవేళ ఎక్కడైనా తప్పులు జరిగితే సంబంధిత గ్రామ, మండల సర్వేయర్లు, ఆర్‌ఎస్‌డీటీలు బాధ్యులవుతారు. వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- టి.లక్ష్మణరావు, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా సర్వే విభాగం

నా మాటే శాసనం

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిల్ సభ్యుడు నారాయణరావు

రవికుమార్ తదితరులు మాట్లాడారు. 'మునిసిపల్ చరిత్రలో 23 పేజీలతో కూడిన 73 అంశాలు ఆమోదించేందుకు ఎప్పుడూ రాలేదు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందనడానికి ఇదే నిదర్శనం.' అని అన్నారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించాలని మెజార్టీ సభ్యులు చేతులు పైకిఎత్తారు. అయితే, ఛైర్‌పర్సన్ గౌరీశ్వరీ మాత్రం అజెండాలోని 67, 72వ అంశాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా వైసీపీకి చెందిన వైస్‌ఛైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేష్‌తో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లతో కలిసి సమావేశం మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు.

టీడీపీ సభ్యుల ఆగ్రహం

సభా మర్యాదలు పాటించకుండా, సమావేశం మధ్యలో ఛైర్‌పర్సన్ గౌరీశ్వరీ వెళ్లిపోవడంపై టీడీపీ కౌన్సిలర్లు మంత్రి రవికుమార్, బడే గౌరు నాయుడు, టి.వెంకటరావు, కోరాడ నారాయణరావు, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఛైర్‌పర్సన్‌కు తమవంతు సహాయ సహకారాలు అందించామన్నారు. ఇప్పుడు ఆమెకు అనుకూలంగా లేమని, సమావేశ మందిరం నుంచి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.4 కోట్లతో పట్టణంలోని 30 వార్డుల్లో కూడా అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయన్నారు. కానీ, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-24లో మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2 కోట్ల వరకు ఖర్చు అవ్వలేదన్నారు. ఇప్పటికైనా పట్టణాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అలాగే 13, 14 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అధ్వానంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రజాప్రతినిధులుగా తాము ఎందుకున్నట్లు అని 14వ వార్డు కౌన్సిలర్, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఛైర్‌పర్సన్ వాయిదా వేసిన రెండు అంశాలకు సంబంధించి మెజార్టీ కౌన్సిల్ సభ్యులు చేతులను ఎత్తి తమ ఆమోదాన్ని తెలిపారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వేంకటేశ్వర్లును వివరణ కోరగా.. 'సమావేశం మధ్యలో ఛైర్‌పర్సన్ బయటకు వెళ్లిపోవడం సరికాదు. మెజార్టీ కౌన్సిల్ సభ్యుల తీర్మానాన్ని ఆమోదించాల్సిన అవసరం ఉంది. ఛైర్‌పర్సన్ ఆమోదించని అంశాలపై మెజార్టీ కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి తీర్మానాన్ని (డిసెంట్)ను కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌తో పాటు ఛైర్‌పర్సన్‌కు అందించవచ్చు.' అని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు

(5వ పేజీ తరువాయి)

మీ మొబైల్‌కు వచ్చే పిన్ నెంబర్ చెప్పడంటూ సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని మోసం చేసే అవకాశాలు ఉన్నాయి. మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ వివరాలు ఎవరికీ తెలియజేయవద్దు. స్క్రాచ్ చేయండి.. రివార్డు పొందండి అని వచ్చే సందేశాలను క్లిక్ చేసి ఓపెన్ చేయవద్దు. ఏపీకే పేరు మీద డాక్యుమెంటు వస్తుంది. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదు. ఎటువంటి అనుమానం వచ్చినా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలి.' అని కలెక్టర్ పేర్కొన్నారు.

గోతుల దారిలో ప్రయాణమెలా?

● ప్రమాదకరంగా అలజంగి-కారాడ రహదారి
● తీవ్ర అవస్థలు పడుతున్న వాహనచోదకులు

బొబ్బిలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి నుంచి కారాడ వెళ్లే రహదారి ప్రమాదకరంగా తయారయ్యింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని వాహనచోదకులు, ప్రయాణికులు భయపడుతున్నారు. గుంతల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా గోతులు నీటితో నిండిపోయాయి. వాహనచోదకులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలి నుంచి రాజాం వెళ్లే ప్రధాన రహదారి అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులకు నోచుకోలేదు. రాత్రి వేళ ఎదురుగా వచ్చిన భారీ వాహనాల వెలుతురుతో గోతులను గుర్తించలేక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



గోతులతో నిండిన అలజంగి-కారాడ రహదారి

మాతాశిశు ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి

పార్వతీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేసే దిశగా వైద్య ఆరోగ్యశాఖ అడుగులు వేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అదనపు సంచాలకుడు కేవీఎస్ అనీల్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు పర్యవేక్షణకు విచ్చేసిన ఆయన గురువారం స్థానిక ఎన్జీవో హోంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. పలు అంశాలపై సమీక్ష జరిపారు. గర్భిణుల వైద్య సేవలు మెరుగుపరిచే లక్ష్యంగా జననీ మిత్ర యాప్ ప్రవేశపెట్టారని తెలిపారు. మాతా శిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. స్టేట్ కన్సల్టెంట్స్ నరేంద్ర, వెంకటేష్‌లు యాప్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇందుకు పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ఐదు పీహెచ్‌సీలను ఎంపిక చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, డీఐవో నారాయణరావు, ప్రోగ్రాం అధికారి వినోద్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఏడీ అనీల్‌కుమార్

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం

(5వ పేజీ తరువాయి)

సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 1,503 పాఠశాలలకు 5,184 బస్తాలు, 150 వసతి గృహాలకు 13,456 బస్తాల ఫోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని (ఒక్కో బస్తా 25 కేజీలు) పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి బస్తాపై క్యూ ఆర్ కోడ్ ఉంటుందన్నారు. దాన్ని స్కాన్ చేయగానే బియ్యం ఏ సీజనులో పండింది, ఎక్కడ నుంచి వచ్చిందని, ఏ రకం బియ్యం తదితర వివరాలు అన్ని తెలుస్తాయని అన్నారు. దీనివల్ల ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. జిల్లాకు పాలకొండలోని వెంకటేశ్వర రైస్ మిల్ నుంచి బియ్యం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

మక్కువ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.దేవకుమార్ అన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో ఆయన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన కేంద్రాల్లో రెండో శనివారం యోగాసనాలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

బొబ్బిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వసతి గృహాలను బొబ్బిలి కోర్టు న్యాయాధికారిణి ఎం.రోహిణీరావు గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఎస్టీ కళాశాల బాలికల వసతిగృహం, సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల హాస్టల్, పాతబొబ్బిలి బాలసదనంలను ఆమె పరిశీలించారు. సమస్యలేమైనా ఉంటే తక్షణం తెలియపరచాలన్నారు. వర్షాకాలంలో విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన నీటిని, పరిశుభ్రమైన ఆహారాన్ని వారికి అందజేయాలని ఆమె ఆదేశించారు.



బొబ్బిలిలో వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న న్యాయాధికారిణి రోహిణీరావు

తోటపల్లి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

బెలగాం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితుల పెండింగ్ సమస్యలు గత వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేదని, నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి, నిర్వాసితులను ఆదుకోవాలని ఆయన కోరారు. 1500 మందికి ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లించలేదని, కొన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేదని అన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బంటు దాసు, జియ్యమ్మవలస, బిత్తర పాడు తదితర నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిటివా డ ఫీడర్ పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.విష్ణుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ● జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గం పరిధిలో కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీ పురం మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరా యం కలగనున్నదని ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సౌకర్యం ఉండదని చెప్పారు. అడ్డాపు శీల వద్ద కలెక్టర్ నూతన కార్యాలయం సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటులో భాగంగా కురుపాం నుంచి జియ్యమ్మవలస వరకు విద్యుత్ లైన్ల వెంబడి ఉన్న చెట్టు కొమ్మలను కట్ చేస్తామని ఏఈ బి.శంకరరావు తెలిపారు.

సందడిగా సామూహిక అక్షరాభ్యాసాలు

బొబ్బిలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. ● రామభద్రపురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2, 3 కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● బొబ్బిలి: పట్టణంలోని 14, 16, 18, 7, 9 వార్డులలో రావువారి వీధి, చినచెరువు గట్టు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చాలా సందడిగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ● గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మెరుగైన బోధన అందిస్తున్నామని కొమరాడ ఐసీడీఎస్ సీడీపీవో జి.సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, పి.అరుణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం



బొబ్బిలి రూరల్: పక్కిలో అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం



రామభద్రపురంలో..

న్యూస్ బాక్స్

విమాన ప్రమాదం దురదృష్టకరం

గుమ్మలక్ష్మీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె గురువారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడుతూ ఈ దురదృష్టకర సంఘటనకు యవత్ ప్రపంచం శోక సంద్రంలో మునిగిపోయిందన్నారు. క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, వారు త్వరగా కోలుకోవాలని కోరారు.

పెదభోగిలి ఈవోగా సురేష్

సీతానగరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదభోగిలి పంచాయతీ ఈవోగా పి.సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇచ్ఛాపురం నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

సూర్యఘర్‌పై అవగాహన

గరుగుబిల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కలిగిఉండాలని వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. పెద్దూరు గ్రామంలో ఆయన గురువారం అవగాహన కల్పించారు. సోలార్ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి, మండల వెలుగు శాఖ నుంచి రుణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వెలుగు సీసీ సీహెచ్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

గరుగుబిల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు అన్నారు. గురువారం నాగూరులో ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఏఈవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

వీరఘట్టం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లగుడ్డి గ్రామ సమీపంలో గురువారం 1400 లీటర్ల బెల్లంఊట గుర్తించి ధ్వంసం చేశామని ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు. సారా తయారీ, అమ్మకం చేసినట్టు తెలిస్తే, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సగానికి విరిగిపోయిన విద్యుత్ స్తంభం

సాలూరు, జూన్ 12(ఆంధ్ర జ్యోతి): పటణంలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి నాయుడువీధి రామమందిరం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం మధ్యకు విరిగిపోయి నేలకొరిగింది. స్థానికంగా ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి

పార్వతీపురంటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కోరుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

జిల్లాలో సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమస్యలు పరిష్కరించకుండా టీడీపీ ప్రభుత్వానికి సంబరాలు ఎందుకని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. గుమ్మలక్ష్మీపురంలో సీపీఎం మండల కమిటీ సమావేశం సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో జంఝావతి, గుమ్మడిగెడ్డ, అడారుగెడ్డ, వనకాబడిగెడ్డ, జంపరకోటగెడ్డ, రాళ్లగడ్డ, తోటపల్లి ప్రాజెక్టులతో పాటు గిరిజన చెక్‌డ్యామ్‌లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాలను పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు మండంగి రమణ, పార్టీ మండల సభ్యులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

జియ్యమ్మవలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల ఐకేపీ కార్యాలయంలో గ్రామైక్య సంఘం వీవోఏలకు లోక్ ఆపరేటింగ్ సిస్టమ్ (లోకోస్)పై రెండు రోజుల శిక్షణా తరగతులు మండల మహిళా సంఘ అధ్యక్షురాలు పల్లి రాజేశ్వరి అధ్యక్షతన గురువారం ప్రారంభమయ్యాయి. దీనికోసం సెర్ప్ నుంచి ఈఎంటీలు నూర్జహాన్, నీలాకుమారిలు మండల కేంద్రానికి వచ్చి శిక్షణ ప్రారంభించారు. మహిళల పూర్తి జాబితా, గ్రామైక్య సంఘ జాబితా, మండల సమైక్య డేటా వివరాలు తీసుకోవడంతో పాటు వారి ఆర్థిక లావాదేవీలు, వారికి ఇచ్చిన రుణాలు సక్రమంగా కడుతున్నారా లేదా.. తదితర అంశాలను తీసుకుంటున్నారు. దీనిని లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఈఎంటీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు సీతమ్మ, నాగభూషణరావు, వీవోఏలు పాల్గొన్నారు.



వీవోఏలకు శిక్షణ ఇస్తున్న ఈఎంటీలు

పాఠశాలల ప్రారంభం

భామిని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించినట్టు ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కరరావు తెలిపారు. ఈ పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కీసర పాఠశాలకు జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం నాటి జీవోను రద్దు చేస్తూ భామిని, బాలేరు, పెద్దదిమిలి, బత్తిలి జిల్లా పరిషత్ పాఠశాల ల్లో కొత్త విధానాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

● పాలకొండ: విద్యార్థులకు మంచి విద్యను అందించాలని టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ అయిన పాఠశాలను ఆయన గురువారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank | నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పాద్ర రోడ్, వడోదర - 390 007. కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో **జూన్ 23, 2025**న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / ఇ-వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: అనంతపూర్ - బళ్లారి రోడ్	
460462000235	[illegible]
శాఖ పేరు: [illegible]	
067762014443	సబ్బెళ్ల ధర్మారెడ్డి
067762015876	[illegible]
శాఖ పేరు: బెండపూడి	
307162001777	ఏనుగుపల్లి మరియమ్మ
శాఖ పేరు: బొమ్మయ్యగారి పల్లి	
284462000477	ఆర్ వెంకటరమణారెడ్డి
శాఖ పేరు: కడప	
067462014218	నారాయణ రెడ్డి అండ్లూరు
శాఖ పేరు: దర్శి	
782962000255	రామతోటి ప్రసన్న
782962000353	వీరంరెడ్డి మల్లికార్జునరెడ్డి
శాఖ పేరు: డోన్	
794962000134	మాదిగ రాజశేఖర్
794962000335	రాగిమను కమలాబీ
శాఖ పేరు: గుడివాడ	
061162006905	చిట్టూరి పాములరావ్
శాఖ పేరు: గుంటూరు	
630762031468	ఉప్పు అరుణ కుమారి
శాఖ పేరు: గుంటూరు - కొత్తపేట	
664962602496	పవన్ కళ్యాణ్ రాగిడి
శాఖ పేరు: ఐ.ఎస్. జగన్నాథపురం	
286662000248	సుంకర అప్పన్న
శాఖ పేరు: [illegible]	
307462000455	[illegible]
307462001253	వీరపల్లి వెంకటరెడ్డి
307462001224	బొజ్జల చిన్న అంజమ్మ
శాఖ పేరు: కదిరి	
395462003510	పటాన్ గఫూర్ ఖాన్
395462004242	బి చిన్న బాబునాయక్
శాఖ పేరు: కాకినాడ - సర్పవరం	
247762001905	సైది రమేష్ కుమార్
శాఖ పేరు: కనిగిరి	
069862016912	ముంగర ఎర్ర నాగయ్య
శాఖ పేరు: [illegible]	
752462000986	బమల రామకృష్ణ
శాఖ పేరు: కొవ్వూరు	
377962002576	తాళ్లూరు కాంతమ్మ
శాఖ పేరు: కర్నూలు - సి క్యాంప్	
756762002010	బింగిదొడ్డి రమేష్
శాఖ పేరు: మాచర్ల, ఆంధ్రప్రదేశ్	
377062003538	కుక్కమూడి అశోక్
శాఖ పేరు: మదనపల్లె	
067362036480	కె గౌతం రెడ్డి

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: [illegible]	
307562000730	[illegible]
శాఖ పేరు: [illegible]	
788962000112	రాజశేఖర్ జక్కం
శాఖ పేరు: నాయుడుపేట	
069462012198	మొంచెం చెంచు సాయి
069462012200	గంధం [illegible]
069462012204	అందాలమాల విజయమ్మ
శాఖ పేరు: నంద్యాల	
068862010659	దూదేకుల ఖాసింపీర
068862014404	డి. [illegible] వెంకట స్వామి
శాఖ పేరు: నరసన్నపేట	
751962000718	[illegible]
శాఖ పేరు: నర్సీపట్నం	
400262004498	బట్ల గంగ గణేష్
400262004533	బట్ల గంగ గణేష్
శాఖ పేరు: నెల్లూరు - స్టోన్ హౌస్ పేట్	
789062000184	గల్లా నాగేశ్వర రావు
శాఖ పేరు: [illegible]	
069962011687	కేశవరావ్ మురిపింటి
శాఖ పేరు: [illegible]	
306562001347	[illegible]
శాఖ పేరు: [illegible]	
070162016983	[illegible]
శాఖ పేరు: [illegible]	
285862000543	కాకుటూరు లక్ష్మీరెడ్డి
శాఖ పేరు: పిఠాపురం	
400862004053	అనుముల వీర నాగమణి
400862004058	[illegible]
శాఖ పేరు: [illegible]	
204662000682	పాలగిరి సద్దాం హుస్సేన్
శాఖ పేరు: [illegible]	
430662002327	[illegible]
శాఖ పేరు: రాజంపేట	
067662008487	[illegible]
శాఖ పేరు: [illegible]	
400162004333	గుర్రం రాంబాబు
శాఖ పేరు: [illegible]	
285362000577	కాకర్లమూడి నాగేశ్వరరావు
శాఖ పేరు: [illegible]	
253062001256	[illegible]
శాఖ పేరు: [illegible]	
130562007793	నరెడ్డి అరుణ్ కుమార్ రెడ్డి
శాఖ పేరు: తెనాలి	
253162007040	రాజమండ్రి ముకుంద ప్రియ
శాఖ పేరు: తుని	
197962013053	[illegible]
శాఖ పేరు: విజయవాడ - మొగల్రాజపురం	
783062000096	తాడేపల్లి వెంకట ప్రభాకర్
శాఖ పేరు: విజయవాడ - ఏలూరు రోడ్	
180362002864	నందిని చౌదరి యలమంచిలి
శాఖ పేరు: విజయవాడ - వన్‌టౌన్	

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
030362006195	[illegible]
శాఖ పేరు: విశాఖపట్నం - అక్కయ్యపాలెం	
241162000875	యుగంధ్రేశ్వర్ కుదుపూడి
241162000877	యుగంధ్రేశ్వర్ కుదుపూడి
241162001062	శ్రీనివాస శర్మ పేరి
శాఖ పేరు: విజయనగరం	
070262006455	దుప్పాడ సాయి రవి తేజ
శాఖ పేరు: [illegible]	
307262002725	గట్టెం వెంకట రమణ
శాఖ పేరు: గద్వాల్	
092062015948	జక్కిరెడ్డి బాల్ నర్సింహులు
శాఖ పేరు: [illegible]	
752562001905	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - కూకట్‌పల్లి	
631262037091	గంగిరెడ్డి శివ శంకర రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్-సంజీవరెడ్డి నగర్	
007562020737	బల్‌రామ్ శివ క్రిష్ణ
007562020743	బల్‌రామ్ శివ క్రిష్ణ
శాఖ పేరు: హైదరాబాద్ - సుచిత్ర క్రాస్ రోడ్స్	
384562002128	[illegible]
శాఖ పేరు: [illegible], ఆంధ్రప్రదేశ్	
351462009834	[illegible]
శాఖ పేరు: [illegible]	
108562012382	బసంత శివ్ శంకర్ రావ్
శాఖ పేరు: జగిత్యాల	
280862007694	మంతెన శంకరమ్మ
శాఖ పేరు: జనగాం	
070362017588	[illegible]
శాఖ పేరు: [illegible]	
222262000449	[illegible]
222262001746	[illegible]
శాఖ పేరు: [illegible]	
775562000898	[illegible]
శాఖ పేరు: కూకట్‌పల్లి - నిజాంపేట్	
180562003707	బాదం సాయి ప్రతాప్
శాఖ పేరు: నల్గొండ	
059962009791	సిలిగిరెడ్డి సంధ్య
శాఖ పేరు: [illegible]	
321762000344	కొత్తపోతుల వెంకట శివ ప్రసాద్
శాఖ పేరు: [illegible]	
379962004893	[illegible]
శాఖ పేరు: [illegible]	
426662001422	[illegible]
శాఖ పేరు: [illegible]	
794862000096	బొంతు సంజీవరావ్
శాఖ పేరు: [illegible]	
222362000553	[illegible]
శాఖ పేరు: [illegible]	
222462000988	[illegible]
222462001224	ఎమ్‌డి సుందర్ షరీఫ్
శాఖ పేరు: వనపర్తి	
131162024231	గుండు రవికుమార్

తేదీ: 13.06.2025
ప్రదేశము: అనకాపల్లి, అనంతపురము, అన్నమయ్య, బాపట్ల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణ, కర్నూలు, నంద్యాల, ఎన్‌టిఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, విజయనగరం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, వై.యస్.ఆర్. అనంతపూర్, సిసికుంట, చిలకలూరిపేట, గద్వాల్, హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ, నెల్లూరు, వైజాగ్, వనపర్తి, వరంగల్.

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున